


రెంజల్ : వీరన్నగుట్టలో విద్యుత్తు వెలుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు : జిల్లా కేంద్రం వినాయక్‌నగర్ అశోక టవర్స్ వాసుల సంబరం

ఊరు.. వాడ.. బతుకమ్మ ఆడ

తమ ఆత్మీయనేస్తం బతుకమ్మ పండుగ కోసం ఆడపడచులు పుట్టింటికి వచ్చారు.. వివిధ ప్రాంతాల్లో చదువుతున్న యువతులూ సొంతూళ్లకు చేరారు.. మహిళలు, వృద్ధులు మనవరాళ్లతో పోటీపడి తీరొక్క పూలు తెచ్చి అందమైన పూలశిఖరాలు పేర్చారు.. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా గ్రామ కూడళ్లకు తరలించారు.. కుటుంబ అనుబంధాలు.. జానపదాలు.. అమ్మవారిని కీర్తిస్తూ.. అన్నాచెల్లి.. అక్కాతమ్ముడి అనురాగాలపై పాటలు పాడుతూ ఆడారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంబరంగా నిర్వహించారు.. తంగేడు పూలల్లో చందమామ.. బతుకమ్మ పోతుంది చందమామ అంటూ స్థానిక చెరువులు, వాగులు, వంకల్లో నిమజ్జనం చేశారు.. వెంట తెచ్చుకున్న సద్దులు ఆరగించారు.. వాయినాలు ఇచ్చుకున్నారు.. ఇలా ఏ ఊరు.. వాడ చూసిన పల్లె సంస్కృతి ప్రతిబింబించింది.. సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం



బోర్గాం(పి) గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు




ఊరేగింపుగా వెళ్తున్న యువతులు: వాగులో బతుకమ్మను నిమజ్జనం చేస్తూ..



బోధన్ : చెక్కి క్యాంపులో..



కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు : ఎమ్మెల్యే పోచారం

వర్ని, న్యూస్‌టుడే : కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్నిలో ఉమ్మడి మండల మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారానికి ఆయనతో పాటు ఎంపీ సురేష్ షెట్కార్, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ హాజరయ్యారు. అనంతరం పోచారం మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్, రేషన్‌కార్డులు త్వరగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటించి విభేదాలు సృష్టించొద్దని, పార్టీలో ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పినట్లు వివరించారు. సాధ్యమైనంత మేర ఎంపీ నిధులు ఇస్తానని, పార్టీలకతీతంగా ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీ సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ కొందరు నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని.. వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. అంతకుముందు మార్కెట్ కమిటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అంబర్‌సింగ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పోచారం, చిత్రంలో ఎంపీ సురేష్ షెట్కార్, కాసుల బాల్‌రాజ్

హామీలు విస్మరించిన కాంగ్రెస్: ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, ఏర్గట్ల, న్యూస్‌టుడే: పేదల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన గొప్పపథకం కల్యాణలక్ష్మి అని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కొనియాడారు. కానీ కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక తులం బంగారం సైతం ఇస్తామని చెప్పిన హామీని మర్చిపోయిందని విమర్శించారు. ముప్కాల్ రైతువేదికలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అక్కడున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకొని నినాదాలు చేశారు. రెండు పడక గదుల ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం చేసిందేంటని ప్రశ్నించారు. ర.భ మంత్రిగా ఉండి కనీసం నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఇళ్లు ఎందుకు నిర్మించలేదన్నారు. దీంతో కాంగ్రెస్, భారాస నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు వారిని బయటకు పంపించి లబ్ధిదారులకు చెక్కులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీ. హెచ్.కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్లలోని కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆలస్యంగా రావడంపై కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. అధికారులపై మండిపడ్డారు.

అభ్యంతరం తెలిపిన హస్తం శ్రేణులు



ఏర్గట్ల: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ముప్కాల్: వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్, భారాస శ్రేణులు

నుడా ఛైర్మన్‌గా కేశ వేణు

నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నిజామాబాద్ నగరాభివృద్ధి సంస్థ (నుడా) ఛైర్మన్‌గా కేశ వేణు నియమితులైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందన్నారు. అప్పటి భారాస ప్రభుత్వం 2017లో 'నుడా'ను ఏర్పాటు చేసింది. నగరపాలక సంస్థతో పాటు 72 గ్రామాలకు విస్తరించింది. దీని పరిధిలో 6,32,782 మంది నివసిస్తున్నారు. మొదటి ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి కాగా రెండో ఛైర్మన్‌గా ఈగ సంజీవ్‌రెడ్డి పని చేశారు. గతేడాది డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలగించారు. ఆశావహులు చాలా మంది పోటీ పడినప్పటికీ పార్టీకి విధేయుడిగా ఉన్న ఆయననే పదవి వరించింది. ప్రస్తుతం పార్టీ నగర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



ఎస్సారెస్పీకి 11,590 క్యూసెక్కుల వరద

శ్రీరామసాగర్ : ఎస్సారెస్పీకి ఎగువ నుంచి 11,590 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.501 టీఎంసీలు) వరకు నిల్వ ఉందని ఏఈఈ కొత్త రవి తెలిపారు. కాకతీయకు 6800, వరద కాల్వకు 2000, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాల్వకు 150, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నట్లు చెప్పారు.

నేడు హాజరుకావాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా నుంచి డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని 103 గదిలో రిపోర్టు చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నియామకపత్రాలతో రావాలని సూచించారు.

బాధితులకు పరిహారం అందేలా చూడాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనాలు ఢీకొని మృతి చెందినా, తీవ్రంగా గాయపడిన(హిట్ అండ్ రన్) కేసుల్లో బాధితులకు పరిహారం అందేలా అధికారులు చొరవచూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కేసులకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం నిర్వహించి మాట్లాడారు. మృతి చెందితే సాధారణ బీమా కౌన్సిల్ ద్వారా బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం అందించాల్సి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర విచారణ జరిపి నివేదికలు అందించాలని ఆర్డీవోలకు సూచించారు. జిల్లాలో 32 హిట్ అండ్ రన్ కేసులు నమోదు కాగా వాటిలో 27 బాధిత కుటుంబాలను గుర్తించినట్లు అధికారులు వివరించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 17, ఆర్మూర్‌లో 7, బోధన్ మూడు కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకుడు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆమె పాడితే పరవశమే.. | రైతు కష్టం.. కళ్లారా చూస్తూ.. | ఒక్కో రూపం.. అపురూపం | 6 లో

విద్యుత్తు శాఖలో బదిలీలపై వీడని ఉత్కంఠ

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్



విద్యుత్తు శాఖలో ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ వీడటం లేదు. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు ఆ శాఖలో రెండేళ్లు పూర్తయిన వారికి స్థానచలనం కల్పించాల్సి ఉంది. ఇందుకోసం డీఈ స్థాయి నుంచి పరిపాలన విభాగంలో పనిచేసే సిబ్బంది వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కింద స్థాయి సిబ్బందికి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టి బదిలీలకు సంబంధించిన జాబితా తయారు చేశారు. ఈ నెల 7న బదిలీలు నిర్వహించాల్సి ఉండగా.. ఆ రోజు రాత్రైనా బదిలీలు చేపట్టాలా? వద్దా? అనేది తేలలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. వరంగల్‌లో యూనియన్ నాయకుల ఒత్తిడి మేరకు ఈ ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేశారు. రాష్ట్రంలో పెద్ద పండుగ దసరా రావడంతో ఉద్యోగులను ఇబ్బంది పెట్టొద్దనే ఉద్దేశంతో నిలిపివేసినట్లు ప్రచారం జరుగుతోంది. విజయదశమి తర్వాత ఉంటాయని తెలుస్తోంది. జిల్లాలో యూనియన్ నేతలు ఎవరికి వారే పైరవీలు చేస్తున్నారు. తమకు నచ్చిన వారికి మంచి పోస్టింగ్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదంతా అధికారులకు తలనొప్పిగా మారింది. బదిలీలకు సంబంధించి అంతా సిద్ధం చేశామని, సీఎండీ నుంచి ఉత్తర్వులు రాగానే ప్రక్రియ చేపడతామని ఎస్ఈ రవీందర్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

నిధుల వ్యయమెలా?
సర్కారు నిర్ణయంపై ఆధారపడ్డ రూ. 15 కోట్ల పనులు

న్యూస్‌టుడే, బోధన్

సర్కారు నిర్ణయంపై రూ.15కోట్ల నిధుల వ్యయం ఆధారపడి ఉంది. ఏడాది కిందట నిర్వహించిన టెండర్ల పనులపై ప్రభుత్వం స్పష్టతనిస్తే ఒప్పందం కుదిరి బోధన్‌లో అభివృద్ధి పనులు మొదలయ్యే వీలుంటుంది. గత ప్రభుత్వం దశలవారీగా మున్సిపాలిటీలకు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఫర్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా నిధులు మంజూరు చేసింది. వాటిలో రెండు విడతల్లో రూ.25 కోట్ల చొప్పున రూ.50కోట్లు మంజూరు చేసింది. అందులో రూ.35కోట్ల పనులు పూర్తయ్యాయి. మిగితా రూ.15.21కోట్ల విలువ చేసే పనులను పునఃప్రతిపాదించాలనే పురపాలకశాఖ మార్గదర్శకాలతో 2023 శాసనసభ ఎన్నికలకు ముందు ఆమోదం తెలిపి టెండర్లు పిలిచారు. ఒప్పందం చేసుకోవాల్సిన దశలో ఎన్నికల ప్రక్రియ కారణంగా నిలిచిపోయింది. తర్వాత ప్రభుత్వం మారడంతో అంతరాయం ఏర్పడింది. అప్పటి నుంచి సర్కారు నుంచి స్పష్టత కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే అసెంబ్లీ ఎన్నికలకు ముందు బోధన్ బల్దియాకు రూ.20కోట్ల టీయూఎఫ్ఐడీసీ మూడో విడత నిధులు మంజూరయ్యాయి. నిధుల వ్యయానికి టీయూఎఫ్ఐడీసీ నుంచి అనుమతి లభించినా పురపాలకశాఖ నుంచి పాలనాపరమైన అనుమతి లభించలేదు. ఈ అనుమతి లభిస్తే నిధుల వ్యయానికి మార్గం సుగమమవుతుంది.



పూర్తి రుణంగా..

పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ పూర్తి రుణంగా ఇచ్చే ఈ నిధులకు ప్రభుత్వం పూచీకత్తు ఉంటుంది. బల్దియా రుణం తిరిగి చెల్లింపుపై స్పష్టత లేకపోయినా.. ఈ భారాన్ని సర్కారు మోస్తుందన్నది వాస్తవం. ఈ పద్దు కింద మంజూరయ్యే నిధులతో పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పిస్తే టీయూఎఫ్ఐడీసీ బిల్లులు చెల్లిస్తుంది. ఈ పద్దులో నిధుల లభ్యత బ్యాంకు రుణంపై ఆధారపడి ఉంటుంది. మొదట పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా అంతిరెడ్డి రాజారెడ్డి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నేత అంతిరెడ్డి రాజారెడ్డి నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఆరుట్ల రాజేశ్వర్ తర్వాత పది నెలలుగా ఖాళీగా ఉన్న సంస్థ ఛైర్మన్ స్థానాన్ని రాజారెడ్డితో భర్తీ చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ సుదర్శన్‌రెడ్డి అనుచరుడిగా గుర్తింపుపొందారు. విద్యార్థి సంఘం నాయకుడిగా, గోనెరెడ్డి సంఘం అధ్యక్షుడిగా, నిజామాబాద్ సర్వసమాజ్ కమిటీ కన్వీనర్‌గా, సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రాజారెడ్డి

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఆమె పాడితే పరవశమే



● స్వప్నరాణికి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం

చిన్నప్పటి నుంచి పాటలపై ఆసక్తి పెంచుకున్నారు.. పాడుతా తీయగాలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎదుట ఆలపించి ప్రశంసలు అందుకున్నారు. సంగీతంలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర, జాతీయస్థాయిలో ఖ్యాతిగడించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం అందుకున్నారు. కర్ణాటక సంగీతంలో ఇటీవలే డాక్టరేట్ పట్టా అందుకొని ఔరా అనిపించారు. ఆమే జిల్లా కేంద్రం జ్ఞానసరస్వతి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల కర్ణాటక సంగీత అధ్యాపకురాలు డా.స్వప్నరాణి.

అనేక ప్రదర్శనలు

అమ్మ లక్ష్మి, నాన్న ముత్తెన్న ప్రోత్సాహంతో శాస్త్రీయ కర్ణాటక గాత్ర సంగీతంలో శిక్షణ పొందారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి కర్ణాటక, హిందూస్థానీ అంశాల్లో డిప్లొమా, ఆచార్య నాగార్జున వర్సిటీలో బీఏ చేశారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయలో ఎంఏ చదివి, ఇటీవలే పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ అందుకున్నారు. నిజామాబాద్ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో 2004 నుంచి తాత్కాలిక, 2017 నుంచి శాశ్వత అధ్యాపకురాలిగా, అసిస్టెంట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పలు వేదికలపై త్యాగరాజు, అన్నమయ్య, ముత్తుస్వామి తదితరుల సంకీర్తనలు పాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులు, సంగీత సమ్మేళనాల్లో పాల్గొన్నారు. తన శిష్యులకు త్యాగరాజ దివ్య ఆరాధనలో పాల్గొనే అవకాశం కల్పించారు. మారిషస్‌లో నిర్వహించిన సంగీత సమ్మేళనంలోనూ అలరించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నారు. వాసర వాణి స్వరార్చన, ప్రసన్నాంజనేయం, గోదావరి హారతి, క్రీస్తుతో సహవాసం వంటి ఆల్బంలు ఆమెకు మంచి పేరు తెచ్చాయి. కళాజ్యోతి, ఉగాది పురస్కారాలు అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయినిగా పురస్కారం అందుకుంటూ...

తోడ్పాటు అందిస్తా : స్వప్నరాణి

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, సంగీతంలో డాక్టరేట్ చేయడానికి స్ఫూర్తినిచ్చిన వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా సంగీత గురువులు పాలకుర్తి రామకృష్ణ శర్మ ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. అంతర్జాతీయ స్థాయిలో ఇందూరు గాయకులు రాణించేలా నా వంతు తోడ్పాటు అందిస్తా.

రైతు కష్టం.. కళ్లారా చూస్తూ

● క్షేత్ర సందర్శనలో విద్యార్థినులు

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థినులు సాగు బాట పట్టారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌లో చివరి ఏడాది చదువుతున్న విద్యార్థినులు క్షేత్రస్థాయి సందర్శన చేపట్టారు. రైతులతో మాట్లాడుతూ.. పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి అనేక విషయాలు తెలుసుకుంటున్నారు.

బృందాలుగా ఏర్పడి..

మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలో సుమారు 60 మంది విద్యార్థినులు బృందాలుగా ఏర్పడి 5 నెలల పాటు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్, పద్మాజీవాడి, తాడ్వాయి, కృష్ణాజివాడి, బ్రహ్మాజివాడి, కామారెడ్డి, లింగాపూర్ గ్రామాల్లో నివాసం ఉంటూ రైతులతో మమేకమవుతున్నారు. సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు తెలుసుకుంటున్నారు. తరగతి గదుల్లో వారు నేర్చుకున్నవి రైతులకు వివరిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు రైతులకు, విద్యార్థినులకు ప్రయోజనకారిగా ఉంటాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రేవంత్‌నాథన్, అనిల్‌రెడ్డిలు పేర్కొన్నారు.




విత్తనశుద్ధిపై వివరిస్తున్న విద్యార్థినులు

అనుభవాలు తెలుసుకున్నా



- అర్పన, వికారాబాద్



శ్రీజ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్

సాగులో రైతులు పాటిస్తున్న విధానాలు, అధిక దిగుబడులకు తీసుకునే చర్యలు తెలుసుకున్నాం. మేం పలు సూచనలు చేశాం. రైతులు పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాం. తరగతి గదిలో చదివిన చదువుకు క్షేత్రస్థాయిలో సాగు విధానానికి చాలా వ్యత్యాసం ఉంది.

విత్తనశుద్ధి విధానాలు తెలియజేశాం



- సిరిచందన, వెంకిర్యాల్, యాదాద్రి భువనగిరి



అభినయ, శంకర్‌పల్లి, వికారాబాద్

ప్రధాన పంటలైన వరి, చెరకు విత్తన శుద్ధి విధానాలను రైతులకు వివరించాం. అధిక దిగుబడినిచ్చే పద్ధతులు తెలిపాం. తరగతి గదిలో ప్రొఫెసర్లు పాఠాలు బోధిస్తే క్షేత్రస్థాయిలో రైతులు ఉపాధ్యాయుల్లా సాగు విధానాన్ని వివరిస్తున్నారు. భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలను తెలిపాం.

నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో ఉచిత శిక్షణలు ఇస్తున్నామని, ఇందుకు ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతులు, మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అందరికి 30 రోజుల పాటు ఉచితంగా వసతి, భోజనం, అందిస్తామన్నారు. అభ్యర్థులు శుక్రవారం నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తులను అందించాల్సి ఉంటుందని చెప్పారు. వెంట ఆధార్‌కార్డు, నాలుగు ఫొటోలు, రేషన్‌కార్డు, పాన్, బ్యాంక్ ఖాతా పుస్తకంతోపాటు రెండు సెట్ల జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు.

ప్రేమ్‌లాల్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, సామాజిక రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్ నుంచి సమాచారం వచ్చినట్లు ప్రేమ్‌లాల్ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



ఈశ్వర్

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ జేఎన్ స్టేడియంలో ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులు తొమ్మిది పతకాలు సాధించినట్లు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. అండర్-20 విభాగంలో ఎం.ఈశ్వర్(800, 1500 మీటర్ల పరుగు)కు బంగారు, రజత పతకాలు దక్కాయి. అండర్-18 విభాగం జావెలిన్ త్రోలో బి.ఈశ్వర్ ప్రసాద్ బంగారు పతకం గెలుచుకున్నాడు. అండర్-20 విభాగం 400, 200 మీటర్ల పరుగులో సెహ్వాగ్ రజతం, కాంస్య పతకాలు సాధించాడు. అండర్-14 విభాగం ట్రైథ్లాన్‌లో ప్రవీణ్‌కు, అండర్-18 విభాగం డిస్కస్‌త్రోలో గౌతంకు రజత పతకాలు దక్కాయి. అండర్-16 విభాగం లాంగ్‌జంప్‌లో ఆనంద్, అండర్-14 విభాగం ట్రైథ్లాన్‌లో శ్రీను కాంస్య పతకాలు గెలుచుకున్నాడు.

ఆత్మరక్షణ విద్యలో ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ విద్య తగ్-తా మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించారని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లవన్‌కుమార్, శిక్షకుడు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన ఖేలో ఇండియా జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి 23 మంది ప్రాతినిధ్యం వహించగా జిల్లా నుంచి తొమ్మిది మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇందులో నిఖిత, శ్రీనాథ్ కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు.



నిఖిత



శ్రీనాథ్

ఒక్కో రూపం.. అపురూపం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మను గురువారం వైభవంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. భిన్న రూపాల్లో అమ్మవారి బతుకమ్మలు ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, భిక్కనూరు, కామారెడ్డి పట్టణం, నిజామాబాద్ సాంస్కృతికం



భిక్కనూరులో అమ్మవారి అవతారంలో..




కామారెడ్డిలో..



నిజామాబాద్ వాసవీమాత ఆలయంలో..



నిజామాబాద్ కిషన్‌గంజ్‌లో..



ఎండు ఫలాలతో..

ఒకే ప్రయోగశాల.. తప్పని అగచాట్లు

● బోధనాసుపత్రిలో పెరిగిన రద్దీ

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

కామారెడ్డి బోధనాసుపత్రిలో రద్దీ బాగా పెరిగింది. వంద పడకల ప్రాంతీయాసుపత్రి నుంచి జిల్లా స్థాయి, ఆ తర్వాత బోధనాసుపత్రిగా మారింది. గతంలో 700-800 ఓపీ రాగా ప్రస్తుతం 1200 వరకు రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. రద్దీకి అనుగుణంగా వసతులు కల్పించడంలో అగచాట్లు తప్పడం లేదు. నెలకు 17 వేల నుంచి 25 వేల వరకు ఓపీ వస్తోంది. ఐపీ 1500-1900 వరకు ఉంటోంది. పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చినవారిలో కొందరి రక్త నమూనాల సేకరణకు ప్రయోగశాలకు పంపుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వందలాది మంది పరీక్షలకు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నెల	ఓపీ
జనవరి	27006
ఫిబ్రవరి	25213
మార్చి	32316
ఏప్రిల్	31587
మే	34409
జూన్	35248
జులై	27606
ఆగస్టు	32866
సెప్టెంబరు	32,150

స్థాయి పెరిగినా..

330 పడకల ఆసుపత్రిగా ఏర్పాటైనా ఇక్కడ వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. 13 విభాగాలు ఒకే చోట ఉండటంతో ఆసుపత్రి ఇరుకిరుకుగా మారింది. దీనికి తోడు రెండేళ్ల నుంచి అత్యధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. అత్యవసరం అనుకున్నవారికి పరీక్షలు చేస్తున్నారు. సత్వర వైద్య సేవలు పొందాలని ఆసుపత్రికి వచ్చినవారికి చుక్కెదురవుతోంది.



కామారెడ్డి ఆసుపత్రిలో ప్రయోగశాల వద్ద రద్దీ (పాత చిత్రం)

మార్పు రావాలి

ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఇది వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది. ఎలాంటి వనరులు కల్పించకుండా వైద్యకళాశాలు ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా ఇదివరకు ఉన్న జిల్లా ఆసుపత్రులను బోధనాసుపత్రిగా మార్చడంతో సమస్య ఎదురవుతోంది. ఈ విషయమై ఆసుపత్రి పర్యవేక్షణాధికారి రాంసింగ్ స్పందిస్తూ.. కొంత కాలంగా రద్దీ బాగా పెరిగిందన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటామన్నారు. వైద్య సేవల్లో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అక్కా, చెల్లెళ్ల ఆత్మహత్యాయత్నం

☛ చికిత్స పొందుతూ చెల్లెలు మృతి

సదాశివనగర్ : కుటుంబ కలహాల నేపథ్యంలో అక్క ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా ఇది భరించలేని చెల్లెలు అక్కపై ప్రేమతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక సంఘటన సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. అక్కాచెల్లెలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా చెల్లెలు మృతిచెందింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం... అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన గురజాల కిషోర్‌కు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురు మమత(25)ను రామారెడ్డి మండలం మోషంపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. సాఫీగా జరుగుతున్న వారి కాపురంలో మనస్పర్థలు రావడంతో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మమత పది రోజుల కిందట అడ్లూర్ ఎల్లారెడ్డి వచ్చింది. మానసికంగా కుంగిపోయిన మమత ఈ నెల 7వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకొంది. ఇది చూసిన చెల్లెలు ప్రత్యూష(23) కూడా పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఇద్దరినీ చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. ఇద్దరూ చికిత్స పొందుతుండగా చెల్లెలు ప్రత్యూష పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందింది. తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ప్రత్యూష

సమాజ జాగృతికి నిరంతర కృషి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజాన్ని జాగృతం చేయడానికి, హిందువుల్లో సంఘటిత శక్తిని పెంపొందించేందుకు ప్రతి స్వయం సేవకుడు నిరంతరం కృషి చేయాలని, అందరిలో చైతన్యం నింపడమే కాకుండా తన కుటుంబం నుంచే కార్యాచరణ ప్రారంభించాలని హిందూ జాగరణ మంచ్ అఖిల భారత సహ సంఘటన మంత్రి దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రం హరిచరణ్ మార్వాడీ విద్యాలయంలో విజయదశమి మహోత్సవం నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ఆయన ప్రసంగించారు. డాక్టర్‌జీ ఏ ఉద్దేశంతో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారో తెలుసుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. రాబోయే శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సంఘ్ లక్ష్యాలను అమలు చేయాలన్నారు. మారుమూల గ్రామాలు, బస్తీల్లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ప్లాస్టిక్ ముక్త భారత్, జలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం, స్వదేశీ వస్తువుల వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగర కార్యవాహ సత్యం మాట్లాడుతూ.. వచ్చే నవంబరు 10న జిల్లాకేంద్రంలో ఐదు వేల మందితో సంచలనాన్ని ఏర్పాటు చేశామని, అంతా తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ గురుచరణం తదితరులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న దేవేందర్‌రెడ్డి, వేదికపై జిల్లా సంఘచాలక్ గురుచరణం, హాజరైన స్వయం సేవకులు, హిందూ సంస్థల ప్రతినిధులు

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తన ఛాంబర్‌లో గురువారం టెలిమాస్ టోల్‌ఫ్రీ నంబరు బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు, యువత, మహిళలకు మానసిక ఆరోగ్యం గురించి వివరించాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి విభాగంలో టోల్‌ఫ్రీ నెం.1441 ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో జిల్లా వైద్యాధికారి రాజశ్రీ మాట్లాడారు. ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పనులు చేసుకోవాలన్నారు. మానసిక వైద్యుడు డాక్టర్ రవితేజ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని పేర్కొన్నారు.



టెలిమానస్ టోల్‌ఫ్రీ నంబరు బోర్డును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం సూచించారు. రాంపూర్ గ్రామంలో బుధవారం డెంగీతో ఓ యువకుడు మృతిచెందగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం, ఆరోగ్య సిబ్బందితో కలిసి గురువారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలోని ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. జ్వరం తీవ్రం అయ్యే వరకు చూడకుండా ఆసుపత్రికి వెళ్లాలన్నారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్, వైద్యాధికారి సంతోష్, ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణలత, రేణుక, ఆశ, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

బోధన్, న్యూస్‌టుడే: పట్టణాభివృద్ధి, మహాలక్ష్మి ట్రస్టుకు ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యవర్గ అధ్యక్షుడిగా గంగాధర్‌రావు పట్వారీ, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా పోశెట్టి, సంగ్రాం, ఉపాధ్యక్షులుగా లింగం, సాయిలు తదితరులు ఎన్నికైన సంగతి విదితమే.



మేకల్లో కృత్రిమ రాళ్ల పెంపకంపై విచారణ

నవీపేట, న్యూస్‌టుడే: మేకల శరీరంలో కృత్రిమ రాళ్ల పెంపకం చేస్తున్నారనే సమాచారంతో నవీపేట పశువైద్యాధికారి నరేందర్, పంచాయతీ కార్యదర్శి రవీంద్రనాయక్ గురువారం మటనాస్టాల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. నవీపేట శివారులోని ఓ కంకర క్రషర్ సమీపంలో ఓ వ్యాపారి మేకల కొట్టం ఏర్పాటు చేసి మేకల పొట్ట భాగంలో శస్త్ర చికిత్స చేసి రాళ్లు (తుమ్మ గింజలు) అమర్చుతున్నట్లు వచ్చిన సమాచారంతో మేకల కొట్టంపై దాడులు చేసినట్లు అధికారులు వివరించారు. మటనాస్టాల్‌లో 10 మేకలు మాత్రమే ఉన్నాయని, వాటి చెవులకు ట్యాగ్ వేసి జీవాలను విక్రయించరాదని వ్యాపారికి సూచించినట్లు వైద్యాధికారి నరేందర్ తెలిపారు. సమగ్ర విచారణ చేశాకే పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: కలిగోట్‌ వెళ్లే ర.భ.రహదారికి ఇరువైపుల పిచ్చిమొక్కలు పెరిగాయి. - **చిన్నారెడ్డి, కలిగోట్**

పరిష్కారం: పరిశీలించి ప్రమాదకరంగా పిచ్చిమొక్కలు ఉన్నచోట తొలగించేందుకు పైఅధికారులకు నివేదించి సమస్య పరిష్కరిస్తాం. - **గంగాధర్, ర.భ. ఏఈ, జక్రాన్‌పల్లి**

సమస్య: వర్ని రోడ్డు చౌరస్తా నుంచి నాగారం వెళ్లే మార్గంలో రోడ్డుపై గుంతలు పడ్డాయి. - **శివకుమార్, స్థానికుడు**

సమాధానం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **ఇనాయత్, ఏఈ, నగరపాలక సంస్థ**

సమస్య: దుబ్బ బైపాస్‌ను కలిపే కృష్ణ మందిర్ రోడ్డుపై చెత్త పారబోయడంతో పాటు నిప్పు పెడుతున్నారు. - **సతీష్, దుబ్బ**

పరిష్కారం: ఈ సమస్యను గుర్తించాం. కాలనీవాసులు సైతం దీనిపై ఫిర్యాదు చేశారు. నిఘా పెట్టి చెత్త వేసేవారిని పట్టుకుంటాం. ఇక్కడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తాం. - **ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: సుభాష్‌నగర్‌లో నెల రోజులుగా ఫాగింగ్ చేయడం లేదు. దోమలు విపరీతంగా పెరిగాయి. - **ప్రవీణ్, సుభాష్‌నగర్**

పరిష్కారం: వానలు పడ్డప్పుడు ఫాగింగ్ పనిచేయదు. అందుకే కొట్టలేదు. ఆయా కాలనీల్లో దోమల నివారణ చర్యలు చేపడతాం. - **ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

- న్యూస్‌టుడే, జక్రాన్‌పల్లి, నిజామాబాద్ నగరం, నిజామాబాద్ అర్బన్

ఆలయంలో ఎంపీ పూజలు

చందూర్: మోస్రాలోని సీతారామచంద్రస్వామిని ఎంపీ సురేష్ షెట్కార్ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ.. స్వామి వారిని దర్శించుకుంటే అన్నివేళలా విజయం సిద్ధిస్తుందని తెలిపారు. ఆలయంలోని కల్యాణ మండప మరమ్మతులకు రూ.5లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, లక్ష్మణ్, ప్రవీణ్‌గౌడ్, సాయారెడ్డి, అర్చకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శరీరదానానికి అంగీకారం

కోటగిరి: తాను మరణించినా తన అవయవాలు ఇంకొకరికి పనికి రావాలన్న ఉద్దేశంతో తన శరీరాన్ని దానం చేసేందుకు కోటగిరికి చెందిన హన్మంత్ అనే వ్యక్తి ముందుకొచ్చారు. తన మరణానంతరం శరీరాన్ని నిజామాబాద్ వైద్య కళాశాలకు దానం చేస్తున్నట్లు శరీర అవయవదాతల సంఘానికి ఒప్పంద పత్రం రాసిచ్చారు. ఆ అంగీకార పత్రాన్ని గురువారం అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకిశన్‌కు అందజేశారు.


డిచ్‌పల్లి : సుద్దపల్లిలో..


ఆచన్‌పల్లిలో.. బల్దియా ఛైర్‌పర్సన్ పద్మ


గన్నారంలో..


జైతాపూర్‌లో..


వినాయక్‌నగర్ కొత్త హౌసింగ్‌బోర్డుకాలనీలో..


జిల్లాకేంద్రం చంద్రశేఖర్‌కాలనీలో..


ఆర్యనగర్ వైష్ణవిదేవి మాత వద్ద..


నగరంలోని పద్మానగర్‌లో..


బతుకమ్మతో చిన్నారి..


శ్రీనగర్‌కాలనీ రాణాసునయ అపార్ట్‌మెంటులో..


ముబారక్‌నగర్ శివారులోని మహాలక్ష్మి కాలనీలో..


వినాయక్ నగర్‌లో..

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తంగేడు పూలల్ల చందమామ.. బతుకమ్మ పోతుంది చందమామ.. మళ్లొచ్చే ఏడాది.. మళ్లీ రావమ్మా.. అంటూ మహిళలు అమ్మవారికి వీడ్కోలు పలికారు. గురువారం జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆడి వాగులు, బతుకమ్మ కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. నిజామాబాద్ నగరంతో పాటు నిజామబాద్ గ్రామీణం, బోధన్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో సందడిగా వేడుకలు సాగాయి.


బతుకమ్మతో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమనారెడ్డి


మహాలక్ష్మినగర్ జర్నలిస్టుకాలనీలో..


బోధన్ శక్కర్‌నగర్‌లో..


బోధన్ : ఆజాంగంజ్ కాలనీలో..


బర్దీపూర్‌లో..


గాజుల్‌పేట్ జైశ్రీరాం యూత్ ఆధ్వర్యంలో..


దుబ్బాకలో..


సారంగపూర్‌లో..


మంచిప్పలో..


నవీపేట : నాడాపూర్‌లో..


చింతలూర్‌లో..


యోగా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ధన్‌పాల్

యోగాతో ఆరోగ్యం

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: యోగా సాధనతో ఆరోగ్యం సొంతమవుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. మానిక్‌భవన్ స్కూల్ వద్ద హనుమాన్ యోగా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. యోగా రాంచందర్ ఆధ్వర్యంలో సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే యువజన అధికారిణి శైలిబెల్లాల్, రత్నాకర్, లత, వసంత లక్ష్మి పాల్గొన్నారు.

అసమానతలను వ్యతిరేకించడమే లక్ష్యం

కోటగిరి : సమాజంలో అసమానతలను వ్యతిరేకించడమే లక్ష్యంగా పీడీఎస్‌యూ ఆవిర్భవించిందని జంపాల చంద్రశేఖర్ మెమోరియల్ మేనేజింగ్ ట్రస్టీ నిర్వాహకులు మాధవరావు పేర్కొన్నారు. పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ ప్రారంభ సభల్లో భాగంగా ఎత్తొండలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భాస్కర్, జిల్లా అధ్యక్షుడు గౌతం, చంద్రశేఖర్ ప్రసాద్ సోదరి కామేశ్వరి ఉన్నారు.



జిల్లా సెషన్స్ కోర్టు పీపీగా రాజేశ్వర్‌రెడ్డి

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు పీపీగా రాజేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ కార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాజేశ్వర్‌రెడ్డిది నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రం. 1986లో న్యాయపట్టా అందుకున్నారు. 2004 నుంచి 2007 వరకు మొదటి అదనపు జిల్లా కోర్టు పీపీగా పనిచేశారు. కాంగ్రెస్ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. ఇన్‌ఛార్జి పీపీ రాజారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాజడ్జి కుంచాల సునీతను కలిసి తన నియామక పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు రమేశ్, ఎర్రం గణపతి, శ్రీహరి ఆచార్య, గోవర్ధన్, గడుగు గంగాధర్, రాజ్‌కుమార్ సుబేదార్, మధుసూదన్ రావు, రవిరాజ్, వెంకటేశ్, కిరణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆశ నారాయణ తదితరులు ఆయనను అభినందించారు.


పెంటాఖుర్దులో..


నాళేశ్వర్‌లో..


ధర్మారం(బీ)లో


సత్యనారాయణపురంలో...


ఎడపల్లిలో..

ప్రత్యేక పూజలు.. హోమాలు

న్యూస్‌టుడే బృందం : దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. గురువారం వివిధ ప్రాంతాల్లోని దేవాలయాలు, అమ్మవారి మండపాల వద్ద పూజలు చేశారు. హోమాలు, కుంకుమార్చనలు, మంగళహారతులు సమర్పించారు. ప్రసాద వితరణలు చేపట్టారు.


డిచ్‌పల్లి గ్రామీణం : రాంపూర్‌లో..


జక్రాన్‌పల్లిలో..

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ప్రవీణ్‌గౌడ్

నవీపేట, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ యువకుడు బుధవారం రాత్రి మృతి చెందారని ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ధర్మారానికి చెందిన ప్రవీణ్‌గౌడ్(33)కు భార్య ఇద్దరు పిల్లలున్నారు. అదే గ్రామానికి చెందిన నర్సయ్య అనే వ్యక్తి ప్రవీణ్‌గౌడ్ ఇంటి నిర్మాణానికి రూ.50 వేల విలువైన సామగ్రిని మూడేళ్ల కిందట అప్పు రూపంలో ఇచ్చారు. అప్పు తీర్చాలంటూ నర్సయ్య పలుమార్లు బాధితుడి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. అప్పు ఇచ్చిన వ్యక్తి బెదిరింపులకు పాల్పడటంతో బాధలు తట్టుకోలేక మనస్తాపం చెందిన ప్రవీణ్ గౌడ్ ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు అతడిని నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. సోదరుడు ఇది వరకే ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. గురువారం యువకుడి మృతదేహాన్ని సొంతూరు తరలించగా నిజామాబాద్ నార్త్‌రూరల్ సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దమ్మన్నపేట్‌లో..

ధర్పల్లి, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన ధర్పల్లి మండలం దమ్మన్నపేట్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సయ్య(70) బుధవారం ద్విచక్రవాహనంపై వెళ్తూ అజాగ్రత్తతో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఆటోని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని జిల్లా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చెరువులో దూకి ఆత్మహత్య

ఎడపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని కసాబ్‌గల్లీకి చెందిన నర్సింగ్ కళ్యాణ్‌కార్ (55) జానకంపేట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అనారోగ్యంతో బాధపడుతున్న అతను ఈ నెల 8న ఇంటి నుంచి బయల్దేరి జానకంపేట చెరువు వద్దకు వచ్చారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా.. గురువారం ఉదయం మృతదేహం తేలింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించి బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించామని వివరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఉరేసుకొని యువకుడు..

హోన్నాజీపేట్(ధర్పల్లి), న్యూస్‌టుడే: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ధర్పల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్షు(22) ధర్పల్లి



మండలం హోన్నాజీపేట్‌లోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అన్షు ప్రేమించిన అమ్మాయి గుండెపోటుతో మృతి చెందగా.. అది జీర్ణించుకోలేని యువకుడు గురువారం రైస్‌మిల్లు సమీపంలో బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడి బంధువు సేతురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒకటో ఠాణా పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలోని మురుగు కాల్వలో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మద్యం మత్తులో కాల్వలో పడి మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సిరికొండ, న్యూస్‌టుడే: మండలంలోని రావుట్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి సుమారు 4.5 క్వింటాళ్లు అక్రమంగా ఒకరి ఇంట్లో నిల్వ ఉంచారనే సమాచారంతో దాడి చేసి బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళలపై దాడి - ఇద్దరికి జైలు

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: మహిళలను గాయపరిచిన మాక్లూర్ మండలం కల్లడికి చెందిన గంగారాం, ప్రశాంత్‌లకు రూ.5 వేల జరిమానా, ఆర్నెల్ల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హరికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. 2014 మే 26న కల్లడికి చెందిన ఎల్ల భారతి తన పొలంలో చెట్టు కొడుతున్నారని తెలియడంతో గంగ, యమునలతో కలిసి అక్కడికి వెళ్లారు. అక్కడ ఉన్న గంగారాం, ప్రశాంత్‌లను ప్రశ్నించగా వారు కర్రలతో ముగ్గురు మహిళలపై దాడి చేశారు. యమున చెయ్యి విరగగా, మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు మాక్లూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేశారు. పోలీసుల తరఫున ఏపీపీ రాజేశ్‌గౌడ్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు.

తల్లి విషయంలో గొడవ..
ముగ్గురికి జరిమానా

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మాక్లూర్ మండలం కల్లడికి చెందిన పలువురు పరస్పర గలాట కేసుల్లో కొండ్ర పోశెట్టి, కొండ్ర పెద్ద గంగారాం, నడ్పి గంగారాంలకు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా, కట్టకుంటే మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హరికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. 2014 అక్టోబరు 10న తమ తల్లి విషయంలో నలుగురు అన్నదమ్ములు గొడవపడి ఒకరినొకరు గాయపర్చుకొని మాక్లూర్ ఠాణాలో ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపారు. అన్నదమ్ముల్లో కొండ్ర బద్దెన్న మృతిచెందారు. పోలీసుల తరఫున ఏపీపీ రాజేశ్‌గౌడ్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు.

బాలిక అదృశ్యం

పొతంగల్, న్యూస్‌టుడే: పొతంగల్ మండలానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక (15) కనిపించడం లేదని ఆమె కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. సదరు బాలిక ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

డ్రగ్స్ కేసు బెదిరింపు.. తిప్పి కొట్టిన వ్యాపారి

బోధన్ : ఒక వ్యాపారికి వచ్చిన సైబర్ బెదిరింపు కాల్‌ను అప్రమత్తతో తిప్పికొట్టిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన ఒక వ్యాపారికి మధ్యాహ్నం ఒక ఫోన్ కాల్ వచ్చింది. వ్యాపారి కావడంతో సాధారణ కాల్ అనుకుని ఎత్తగా మీ కూతురు డ్రగ్స్ కేసులో పట్టుబడిందని హిందీలో వివరాలు చెప్పబోయాడు. ఫోన్ నంబరును పరిశీలించగా అది ఒక డీఎస్పీ స్థాయి ర్యాంకు ఫొటో ఉంది. ఆయనను బెదిరించే ప్రయత్నం చేస్తుండగా.. ఎక్కడ పట్టుబడిందంటూ ఎదురు ప్రశ్నలు వేయడంతో స్వరం పెంచి తిట్టడం ఆరంభించాడు అవతలి వ్యక్తి. వ్యాపారి మందలించడంతో ఫోన్ కట్ చేశాడు. అయితే అతని ఫోన్ నంబరు, కుటుంబ సభ్యుల పేర్లు సైబర్ మోసగాళ్లకు ఎలా చేరాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఇందూరు సిటీ : రెండో ఠాణా పరిధిలో రౌడీ షీటర్లకు గురువారం నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రానున్న పండగల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించామని సీఐ తెలిపారు. ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ పాల్గొన్నారు.

నమ్మించి.. నగదు కాజేసి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నాలుగో ఠాణా పరిధిలోని బ్యాంకులో నగదు జమచేసేందుకు వెళ్లిన ఖాతాదారు మరో వ్యక్తి చేతిలో మోసపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాఘవేంద్ర మంగళవారం ఆర్యనగర్‌లోని బ్యాంకులో నగదు జమ చేసేందుకు వెళ్లారు. డిపాజిట్ మిషన్‌లో డబ్బులు వేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మాట కలిపాడు. తనకు నగదు అవసరం ఉందని, మీకు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిస్తానని చెప్పాడు. రాఘవేంద్ర నమ్మి నగదు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో డబ్బులు వేసినట్లు ఫేక్ మెసేజ్ చూపగా వచ్చాయనుకొని బాధితుడు వెళ్లిపోయాడు. తర్వాత ఖాతా చూసుకోగా నగదు జమ కాలేదు. మోసపోయానని ఆలస్యంగా తెలుసుకొని గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్ తెలిపారు. డిపాజిట్ మిషన్ వద్ద ఉన్న సీసీ కెమెరా సాయంతో నిందితుడిని గుర్తించే పనిలో పడ్డారు.

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

టీవీలు, చరవాణులకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్

కిసాన్‌నగర్(బాల్కొండ), న్యూస్‌టుడే: యువత, విద్యార్థులు టీవీలు, చరవాణులకు దూరంగా ఉండాలని ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ పేర్కొన్నారు. కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ దృష్టిలోప దినోత్సవాన్ని నిర్వహించారు. కంటి వైద్యులు నరేష్ పాల్గొని కంటి పరీక్షలు చేశారు. వైద్యాధికారి యశ్వంత్, ఆప్తాలమిక్ భుజంగరెడ్డి, సీహెచ్‌వో గిరిబాబు, సబ్ యూనిట్ అధికారి సాయి, రవి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లిలో ఏర్పాటుచేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి గురువారం ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చెన్న, సుంకెట రవి, పడిగల ప్రవీణ్, మహిపాల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



తూకం వేస్తున్న మార గంగారెడ్డి

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నిక



శ్రీనివాస్‌రెడ్డి



రవికుమార్

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆలూర్ మండలం మిర్దాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంట శ్రీనివాస్‌రెడ్డి, పెర్కిట్ ఉన్నత పాఠశాలకు చెందిన రవికుమార్ పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎంపికయ్యారు. ఆయన ఎంపికపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


పీడీఎస్ బియ్యం పట్టివేత

సిరికొండ: రావుట్లలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణ సుమారు 4.5 క్వింటాళ్లు అక్రమంగా ఒకరి ఇంట్లో నిల్వ ఉంచారనే సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు.

మమ్మేలు బతుకమ్మ.. పోయి రా గౌరమ్మ

ఆర్మూర్ డివిజన్‌లోని పలు మండలాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువులకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

న్యూస్‌టుడే బృందం



బతుకమ్మలతో..

భీమ్‌గల్‌లో..

వేల్పూర్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి

బతుకమ్మలతో చిన్నారులు

వెల్మల్‌లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

ముచ్కూర్‌లో..

లింగాపూర్‌లో నృత్యం చేస్తున్న యువతులు

గోనుగొప్పులలో నిమజ్జనానికి తరలివెళ్తూ..

మాక్లూర్‌లో..

ఆర్మూర్ డిపోలో..

వెల్మల్‌లో..

భీమ్‌గల్‌లోని అయ్యప్పనగర్‌లో..

కమ్మర్‌పల్లి గంగపుత్ర కాలనీలో..

'ఎన్నికల హామీలు నెరవేర్చాలి'



మెండోరాలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మెండోరా(బాల్కొండ), న్యూస్‌టుడే: ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మెండోరాలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ సాయం చెక్కులను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అమలైనట్లుగానే రూ.లక్ష సాయం అందిస్తున్నారన్నారు. డీసీసీబీ డైరెక్టర్ శేఖర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సావెల్ సొసైటీ ఛైర్మన్ రాజారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి రథం షెడ్డు ప్రారంభం

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లిలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి రథం కోసం నిర్మించిన షెడ్డును గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బోగ రామస్వామి గురువారం ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్మించిన షెడ్డు పూర్తికావడంతో నిర్వాహకులు అందజేశారు. రాజన్న, చింత దశరథ్, బుచ్చిమల్లయ్య, బాల కిషన్, గంగాధర్, రాజేశ్వర్, రవి తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లు అదుర్స్



సాత్విక

పేద కుటుంబం.. ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన తండ్రి.. బీడీలు చుడుతూ పిల్లలిద్దరినీ చదివిస్తోంది తల్లి. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల కష్టసుఖాలను చూస్తూ పెరిగిన అక్కాచెల్లెళ్లు వారికి పేరు తెచ్చి పెట్టాలని తలిచారు. చదువుతో పాటు తమకు ఇష్టమైన రంగాల్లో రాణిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఎన్‌సీసీలో ఒకరు, కరాటేలో మరొకరు రాష్ట్ర, జాతీయ పతకాలు కొల్లగొడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తామని నమ్మకంతో ఉన్నారు ఏర్గట్లకు చెందిన అక్కాచెల్లెళ్లు సాత్విక, లతిక.

ఎన్‌సీసీ, కరాటేలో ఏర్గట్ల వాసుల ప్రతిభ

– న్యూస్‌టుడే, ఏర్గట్ల

ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన సుధనవేణి శ్రీనివాస్‌గౌడ్, సుమలత దంపతుల కూతుళ్లు సాత్విక, లతిక. వీరికి చిన్నప్పటి నుంచే క్రీడలంటే ఇష్టం. అలాగని చదువును వదిలిపెట్టలేదు. రెండింటిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. పదో తరగతి వరకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివారు. పెద్దమ్మాయి సాత్విక ఇంటర్మీడియట్ జక్రాన్‌పల్లి మోడల్ కళాశాలలో చదవగా.. ప్రస్తుతం నిజామాబాద్ మహిళా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తోంది. చిన్నమ్మాయి లతిక ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాది చదువుతోంది.

సైన్యంలో చేరాలని ఉంది

నిఖత్ జరీన్, మలావత్ పూర్ణాల స్ఫూర్తితో ముందుకెళ్తున్నా. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనేది నా కల. ఉన్నతస్థాయికి ఎదిగి అమ్మానాన్నలకు మంచి పేరు తీసుకొస్తా.

- సాత్విక

సాత్విక పాల్గొన్న విభాగాలు

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 15 జులై, 2024న తిరుచిరాపల్లిలో నిర్వహించిన స్పోర్ట్స్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీడీటీ ర్యాంక్ సాధించి ప్రశంసాపత్రం అందుకున్నారు.

01 ఆగస్టు, 2024 అనంతపురంలో, 03 మే 2024న జేఎన్‌వీ పెద్దాపురంలో నిర్వహించిన క్యాంపుల్లో ప్రతిభ చాటారు.

మొత్తం 11 జాతీయస్థాయి క్యాంపుల్లో పాల్గొన్నారు. తల్ సైనిక్‌లో పాల్గొన్నందుకు ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సాత్వికను అభినందించారు.

లతిక సాధించిన విజయాలు

☛ 26 ఫిబ్రవరి, 2022లో మెట్‌పల్లిలో, 25 మార్చి 2023లో జగిత్యాలలో, 27 ఆగస్టు, 2023లో సిద్దిపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారు.

☛ 27 మే, 2023లో గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో కాంస్యం, 30 ఏప్రిల్, 2023లో విశాఖపట్నంలో పసిడి పొందారు.



అంతర్జాతీయస్థాయిలో రాణిస్తా

భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని దేశానికి పతకాలు తీసుకొస్తా. శిక్షకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించి అమ్మానాన్నల కల నెరవేరుస్తా. - లతిక



ఆర్మూర్‌పట్టణం: చేనేత కాలనీలో..



సోన్‌పేట్‌లో..

హోమాలు.. కుంకుమార్చనలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్మూర్ డివిజన్‌వ్యాప్తంగా ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ హోమాలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు.

- న్యూస్‌టుడే యంత్రాంగం



బాల్కొండలో..



బడాభీమ్‌గల్‌లో 108 నైవేద్యాల సమర్పణ



ఉప్లూర్‌లో..



మామిడిపల్లిలో యజ్ఞం చేస్తున్న భక్తులు



కమ్మర్‌పల్లి పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన



కోమన్‌పల్లిలో..



విద్యానగర్ కాలనీలో హోమం చేస్తున్న కాలనీవాసులు



కొటార్మూర్‌లో..



పురాణీపేట్‌లో..

పైపు పగిలి.. నీరు ఎగిసి



చిట్టాపూర్ సమీపంలో..

చిట్టాపూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: చిట్టాపూర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు రోడ్డు విస్తర్ణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన చెట్లు, ఇతర పొదలు తొలగించడానికి పొక్లెయిన్, ఇతర యంత్రాలతో పనులు చేపడుతున్నారు. గురువారం చెట్ల పొదలు తొలగిస్తుండగా. జలాల్‌పూర్ నుంచి ఆర్మూర్‌కు తాగునీటిని అందించే పైప్‌లైన్‌కు తగలడంతో పగిలింది. ఒక్కసారిగా శుద్ధ జలం ఫౌంటెయిన్‌లా ఎగిసిపడి నీరు వృథా అయింది. వెంటనే మిషన్ భగీరథ అధికారులతో పాటు, ఆర్మూర్ మున్సిపాలిటీ వారికి సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరా నిలిపివేశారు. అనంతరం ధ్వంసమైన చోట మరమ్మతులు చేపట్టారు.

కలిసి కదులుదాం.. కాపాడుకుందాం



బాద్గుణలో కరపత్రాలు పంచుతున్న ఆర్టీసీ స్థల పరిరక్షణ సమితి సభ్యులు

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో ఆర్టీసీకి ఇచ్చిన స్థలాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిరక్షణ సమితి సభ్యులు గురువారం కరపత్రాలు పంచారు. బజార్‌కొత్తూర్, బాద్గుణ, సి.హెచ్.కొండూర్, మయాపూర్, ఉమ్మెడ గ్రామాల్లో పర్యటించి గ్రామ కమిటీ పెద్దలను కలిశారు. ఉమ్మడి మండలంలోని ప్రతి కుటుంబానికి స్థలంపై హక్కు ఉందని గుర్తు చేశారు. ఆర్టీసీ ఇచ్చిన మాట ప్రకారం ఇక్కడ డిపో ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం చేసే ఉద్యమంలో అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంబారుగిరి, గంగాధర్‌గౌడ్, నాందేవ్‌గౌడ్, లింగం, సాయికిరణ్ పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టుచీరల అందజేత

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో ప్రతిష్ఠించిన దుర్గామాతలకు పట్టుచీరలను గురువారం సమర్పించారు. ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి చీరలను మండపాల నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, ప్రధాన కార్యదర్శులు వేణు, యుగంధర్, చిన్నారెడ్డి, శ్రీనివాస్, స్వభావిక, సునీత, నాయకులు పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న పైడి సుచరితరెడ్డి

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1 **మార్టిన్:** 9.00, 3.30, 10.10 **జిగ్రా:** 12.10, **వట్టియన్ ది హంటర్ :** 6.40

స్క్రీన్ 2 **దేవర :** 11.15, 2.50, 6.25, 10.00

స్క్రీన్ 3 **వట్టియాన్ ది హంటర్ :** 9.40, 4.00, 10.20 **మా నాన్న సూపర్ హీరో:** 1.10, 7.30

స్క్రీన్ 4 **విశ్వం:** 9.30, 12.45, 4.00, 7.15, 10.30

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి సన్మానం

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్‌కు నూతనంగా వచ్చిన ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గంజాయిని అరికట్టేందుకు పోలీసు శాఖకు సహకరించాలని ఏసీపీ కోరారు. మాజీ ఎంపీపీ నర్సయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మారుతిరెడ్డి పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఏర్గట్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివనోళ్ల శివకుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీని పార్టీ నిలబెట్టుకుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగనియామకాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సోమ దేవారెడ్డి, నాయకులు రాజారెడ్డి, గడ్డం లింగారెడ్డి, బద్దం లింగారెడ్డి, బాలే శ్రీనివాస్, సాయన్న, భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా సెషన్స్ కోర్టు పీపీగా రాజేశ్వర్‌రెడ్డి

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు పీపీగా రాజేశ్వరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ కార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాజేశ్వర్‌రెడ్డిది నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రం. 1986లో న్యాయపట్టా అందుకున్నారు. 2004 నుంచి 2007 వరకు మొదటి అదనపు జిల్లాకోర్టు పీపీగా పనిచేశారు. కాంగ్రెస్ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. ఇన్‌ఛార్జి పీపీ మాదస్తు రాజారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాజడ్జి కుంచాల సునీతను కలిసి తన నియామక పత్రం అందజేశారు.

అవీ...ఇవీ.. అన్నీ

మహిళలపై దాడి.. ఇద్దరికి ఆర్నెల్ల జైలు శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: మహిళలను గాయపరిచిన మాక్లూర్ మండలం కల్లెడికి చెందిన రొడ్డ గంగారాం, ప్రశాంత్‌లకు రూ.5 వేల జరిమానా, ఆర్నెల్ల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హరికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. 2014 మే 26న కల్లెడికి చెందిన ఎడ్ల భారతి తన పొలంలో చెట్టు కొడుతున్నారని తెలియడంతో గంగ, యమునలతో కలిసి అక్కడికి వెళ్లారు. అక్కడ ఉన్న గంగారాం, ప్రశాంత్‌లను ప్రశ్నించగా వారు కర్రలతో ముగ్గురు మహిళలపై దాడి చేశారు. యమున చెయ్యి విరగగా, మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు మాక్లూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేశారు. పోలీసుల తరపున ఏపీపీ రాజేశ్‌గౌడ్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు.

రతన్ టాటాకు నివాళులు

నందిపేట్, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటాకు గురువారం నందిపేట్‌లో నివాళులర్పించారు. దేశ ప్రయోజనాల కోసం టాటా పలు కార్యక్రమాలు చేశారన్నారు. రవీందర్, మల్లేష్, కృష్ణ, మోహన్, మాధవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నందిపేట్‌లో..

తల్లి విషయంలో గొడవ.. అన్నదమ్ములకు జరిమానా

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మాక్లూర్ మండలం కల్లెడికి చెందిన పలువురు పరస్పర గలాట కేసుల్లో కొండ్ర పోశెట్టి, కొండ్ర పెద్ద గంగారాం, నడ్పి గంగారాంలకు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా, కట్టకుంటే మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హరికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు. 2014 అక్టోబరు 10న తమ తల్లి విషయంలో నలుగురు అన్నదమ్ములు గొడవపడి ఒకరినొకరు గాయపర్చుకొని మాక్లూర్ ఠాణాలో ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపారు. అన్నదమ్ముల్లో కొండ్ర బద్దెన్న మృతిచెందారు. పోలీసుల తరపున ఏపీపీ రాజేశ్‌గౌడ్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు.

మేకల్లో కృతిమ రాళ్ల పెంపకంపై విచారణ

నవీపేట, న్యూస్‌టుడే: మేకల శరీరంలో కృతిమ రాళ్ల పెంపకం చేస్తున్నారనే సమాచారంతో నవీపేట పశువైద్యాధికారి నరేందర్, పంచాయతీ కార్యదర్శి రవీంద్రనాయక్ గురువారం ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. నవీపేట శివారులోని ఓ కంకర క్రషర్ సమీపంలో ఓ వ్యాపారి మేకల కొట్టం ఏర్పాటు చేసి మేకల పొట్ట భాగంలో శస్త్ర చికిత్స చేసి తుమ్మ గింజలను అమర్చుతున్నట్లు వచ్చిన సమాచారంతో మేకల కొట్టంపై దాడులు చేసినట్లు అధికారులు వివరించారు. ఘటనాస్థలిలో 10 మేకలు మాత్రమే ఉన్నాయని, వాటి చెవులకు ట్యాగ్ వేసి జీవాలను విక్రయించొద్దని వ్యాపారికి సూచించినట్లు వైద్యాధికారి నరేందర్ తెలిపారు. సమగ్ర విచారణ చేస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న రాంచందర్

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పెర్కిట్ భీమన్న ఆలయంలో గురువారం నిర్వహించిన జిల్లా ఆదివాసీ నాయకపోడ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. ఎస్టీ వర్గీకరణ అంశంపై రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో చర్చించాలని, పోటీ పరీక్షలకు హాజరయ్యే నాయకపోడ్ విద్యార్థులకు సంఘం నుంచి సహకారం అందించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, గంగాధర్, పవన్‌కుమార్, అశోక్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.